# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

**JANUARY-2019**

సంవత్సర సభ్యత్వము రూ।। 50/-

# టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

## సత్యవాణి

ఆదివారం సాయంత్రం : 6.00 గంటలకు శుభవార్త

బుధవారం సాయంత్రం : 6.30 గంటలకు రక్షణ

గురువారం మధ్యాహ్నం : 2.30 గంటలకు రక్షణ

ప్రతిరోజు ఉదయం : 7.30 ని॥ కాంతి ఛానల్‌లో

ప్రతిరోజు మధ్యాహ్నం : 3.30 ని॥ కాంతి ఛానల్‌లో

ప్రసంగీకులు : జాషువా గూటం

రిక్కీ గూటం

రోనీ గూటం

Youtube లో satyavanicoc.kkd లో

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి

**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

# సత్యవాక్కు

THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001.

Ph : 0884-2363722 Cell : 98489 98547

Editor

JOSHUA GOOTAM

Pleading for Restoration of First Century Christianity

| పంపుటి - 40 | జనవరి - 2019 | సంచిక -6 |
|---|---|---|


## ఇదిగో సమస్తమును క్రొత్తవాయెను!

### ( Behold Every thing is New! )

"అప్పుడు సింహాసనాసీనుడై యున్నవాడు - ఇదిగో సమస్తమును నూతనమైనవిగా చేయుచున్నానని చెప్పెను" (ప్రకటన 21:5,6). మన దేవుడు అల్ఫాయు ఓమేగయునై యున్నారు. అనగా ఆయన ఆదియు అంతమునై యున్నారు. ఇదిగో సమస్త మును నూతనమైనవిగా చేయుచున్నానని ఆయన చెబితే, అవి అట్లే జరుగును. ఆయన చేసిన, చేయుచున్న నూతన సంగతులను కొన్నిటిని తెలిసి కొందాము. ఆయన క్రొత్త సంగతులను కొన్నిటిని వాగ్ధానము చేసి యున్నారు. అవేవనగా :

క్రొత్త నిబంధన : ఆయన ఇశ్రాయేలీయులతో మోషే ద్వారా నిబంధన చేయకముందు వారిని ఒక రాజ్యముగాను యాజకరూపమైన పరిశుద్ధ జనముగాను చేతునని వాగ్ధానము చేసెను. "కాగా మీరు నామాట శ్రద్ధగా విని నా నిబంధన ననుసరించి నడిచిన యెడల మీరు సమస్తదేశజనులలో నాకు స్వకీయ సంపాద్యమగుదురు. సమస్త భూమియు నాదేగదా. మీరు నాకు యాజక రూపమైన రాజ్యముగాను పరిశుద్ధమైన జనముగాను ఉందురు" (నిర్గమ 19:5,6). చెప్పినట్లుగానే యెహోవా

దేవుడు ఇశ్రాయేలీయులతో పాత నిబంధన చేసెను. అందులో పది యాజ్ఞలు ఒక భాగమైయున్నవి (నిర్గమ 20:1-7).

అయినను ఇశ్రాయేలీయులు ఆ నిబంధనను బట్టి నడుచుకొనలేక పోయిరి. ఆ నిబంధనను మీరి ప్రతి వాడు పాపముచేసెను. గనుక ఆయన ఒక క్రొత్త నిబంధనచేతునని వాగ్దానము చేసెను : "ఇదిగో నేను ఇశ్రాయేలు వారితోను యూదా వారితోను క్రొత్తనిబంధన చేయు దినములు వచ్చుచున్నవి. ఇదే యెహోవా వాక్కు. అది ఐగుప్తులో నుండి వారిని రప్పించుటకై నేను వారిని చెయ్యిపట్టుకొనిన దినమున వారి పితరులతో నేను చేసిన నిబంధన వంటిదికాదు. నేను వారి పెనిమిటినైనను వారు నా నిబంధనను భంగము చేసికొనిరి; యిదే యెహోవా వాక్కు. ఈ దినములైన తరువాత నేను ఇశ్రాయేలు వారితోను, యూదా వారితోను చేయబోవు నిబంధనయిదే, వారి మనస్సులలో నా ధర్మవిధి ఉంచెదను, వారి హృదయముల మీద దాని వ్రాసెదను. యెహోవా వాక్కు యిదే" (యిర్మీయా 31:31-34; హెబ్రీ 8:7-12).

ఆయన చెప్పినట్లే యేసుక్రీస్తు ద్వారా మనకు క్రొత్త నిబంధన అనుగ్రహించబడినది. పాత నిబంధన ఇశ్రాయేలీయులకు మాత్రమే వర్తించితే, క్రొత్తనిబంధన సర్వజనాంగములకు వర్తించును (మత్తయి 28: 18-20; మార్కు 16:15,16).

**నూతన హృదయము :** ఇశ్రాయేలీయులు పాపముచేసి విగ్రహారాధనకులోనైనందున ఆయన వారిని శుద్ధిచేసి నూతన హృదయము నిత్తునని వాగ్దానము చేసెను. "మీ అపవిత్రత పోవునట్లు నేను మీ మీద శుద్ధ జలము చల్లుదును. మీ విగ్రహముల వలన మీకు కలిగిన అపవిత్రత అంతయు తీసివేసెదను. నూతన హృదయము మీకిచ్చెదను, నూతన స్వభావము మీకు కలుగజేసెదను. రాతిగుండె మీలో నుండి తీసివేసి మాంసపు గుండెను మీకిచ్చెదను. నా ఆత్మను మీయందు ఉంచి నా కట్టడలననుసరించిన వారిని గాను నా విధులను గైకొనువారిని గాను

మిమ్మును చేసెదను" (యెహేజ్కేలు 36:21-29). అందువలన "నా కుమారుడా, నీ హృదయము నాకిమ్ము" అని ఆయన చెప్పుచున్నారు. క్రీస్తు యేసు నందు విశ్వాసముంచి, మారు మనస్సుపొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన యెడల ఆయన మనకు పరిశుద్ధాత్మయను వరమునను గ్రహించును (అపొ.కా. 2:38). నూతన స్వభావము నూతన హృదయము గలవారమై నాటి నుండి మనం నడుచుకొందాము.

నూతన సృష్టి: "కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవిగతించెను, ఇదిగో క్రొత్త వాయెను" (2 కొరింథీ 5:17). నీవు క్రీస్తునందున్న యెడల నీవొక నూతన సృష్టియే. పాపముల విషయమై మారు మనస్సునొందిన విశ్వాసి పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందినప్పుడు తన గతపాత జీవిత మును నీటి సమాధిలో పాతిపెట్టును. నూతన సృష్టిగా దాని నుండి లేచును. "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగురా? కాబట్టి తండ్రి మహిమవలన క్రీస్తుమృతులలో నుండి యేలాగు లేపబడెనో ఆలాగే మనమును నూతన జీవము పొందిన వారమై నడుచుకొనునట్లు మనము బాప్తిస్మము వలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి.

"మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఆయనతో ఐక్యముగలవారమైన యెడల ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును ఐక్యము గలవారమైయుందుము. ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పాపశరీరము నిరర్ధకమగునట్లు మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువ వేయబడెనని యెరుగుదుము" (రోమా 6:3-6).

మరల పౌలు ఇట్లు చెప్పు చున్నాడు. "మన ప్రభువైన యేసుక్రీస్తు సిలువ యందు తప్ప మరిదేని యందును అతిశయించుట నాకు దూరమవును గాక; దాని వలన నాకు

లోకమును లోకమునకు నేనును సిలువ వేయబడియున్నాము. క్రొత్త సృష్టి పొందుటయేగాని సున్నతి పొందుట యందేమియు లేదు; పొందక పోవుట యందేమియులేదు'' (గలతీ 6:14,15).

క్రొత్త ఆజ్ఞ : యేసుప్రభువు సిలువ వేయబడక ముందు తన శిష్యులకొక క్రొత్త ఆజ్ఞ యిచ్చారు. ఆయన ఇట్లు చెప్పారు : "మీరు ఒకరి నొకరు ప్రేమింపవలెనని మీకు క్రొత్త ఆజ్ఞ యిచ్చుచున్నాను. నేను మిమ్మును ప్రేమించినట్లే మీరును ఒకరినొకరు ప్రేమింపవలెను. మీరు ఒకని యెడల ఒకడు ప్రేమ గలవారైన యెడల దీనిని బట్టి మీరు నా శిష్యులని అందరు తెలిసి కొందురనెను" (యోహాను 13:34,35). ప్రేమించుడి గాని ద్వేషింపకుడి యనునది క్రీస్తు బోధ (మత్తయి 6:43-48; రోమా 12:17-21). ఏలయనగా ప్రేమ అనేక దోషములను కప్పును (1 పేతురు 4:18).

క్రొత్త నామము : పాతనిబంధన కాలములో దేవుడు తన ప్రజలకొక క్రొత్త నామము నిత్తునని వాగ్దానము చేసారు. "జనములు నీనీతిని కనుగొనును. రాజులందరు నీ మహిమను చూచెదరు. యెహోవా నియమింప బోవు క్రొత్తపేరు నీకు పెట్టబడునని" ఆయన చెప్పారు (యెషయా 62:2).

అదొక శ్రేష్టమైన నామము : "యెహోవా ఈలాగు సెలవిచ్చు చున్నాడు. నాయింటను నా ప్రాకారము లలోను ఒక భాగమును వారికిచ్చెదను. కొడుకులు కూతుళ్లు అని యనిపించు కొనుట కంటె శ్రేష్టమైన పేరు వారికి పెట్టుచున్నాను. కొట్టివేయబడని నిత్యమైన పేరు వారికి పెట్టుచున్నాను" (యెషయా 56:5,6). అది క్రైస్తవుడు అను నామము. క్రీస్తును బాప్తిస్మము ద్వారా ధరించుకొన్నవాడు క్రైస్తవుడు. అన్ని నామములకంటే ఘనమైన నామము క్రీస్తునామము (అపొ.కా. 4:12; 11:26; 26:28; 1పేతురు 4:16)

క్రీస్తును ధరించుకొని మరణ పర్యంతము నమ్మకముగా జీవించిన వానికి క్రొత్తభూమి, క్రొత్త ఆకాశము నిత్యజీవము వాస్తవమగును (ప్రకటన 21:1,2).

# క్రీస్తు యేసు నందున్న దీవెనలు

## ( Blessings in Christ Jesus )

క్రీస్తు యేసు నందుండువాడు క్రైస్తవుడు. “కాగా ఎవడైనను క్రీస్తు నందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్త వాయెను” (2 కొరింధి 5:17). “క్రీస్తు నందున్న యొక మనుష్యునినేనెరుగుదును. అతడు పదునాలుగు సంవత్సరముల క్రిందట మూడవ ఆకాశమునకు కొనిపోబడెను” (2 కొరింధి 12:2).

యేసుక్రీస్తు ద్వారా దేవునితో సరియైన సంబంధము కలిగి యుండిన వారికి మాత్రమే ఆత్మీయ ఆశీర్వాదములు వచ్చును. “తన సిలువవలన ఆద్వేషమును సంహరించి, దానిద్వారా వీరిద్దరిని ఏకశరీరముగా చేసి, దేవునితో సమాధానపరచవలెనని ఈలాగు చేసెను. గనుక ఆయనయే మనకు సమాధానకారకుడై యున్నాడు” (ఎఫెసి 2:16). క్రీస్తు ప్రభువునందున్న వారు అనుభవించగలిగే కొన్ని దీవెనలు.

**క్రీస్తునందు క్షమించబడుట అనే దీవెన :** “పేతురు మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు” (అ.కా. 2:38). “ఆయన వెలుగులో యున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులుగా చేయును” (1యోహాను 1:7). యేసు రక్తము ప్రతి ఒక్కరిని పవిత్రులనుగా చేయును. పవిత్రులుగ నిలువబెట్టును. వెలుగులో నడచుటకు తోడ్పడును.

**క్రీస్తు యేసు నందు సమాధానమనే దీవెన :** క్రీస్తు నందుండక వేరుండువాడు దేవునికి విరోధి. "వ్యభిచారిణులారా, ఈలోక స్నేహము దేవునితో వైరమని మీరెరుగరా? కాబట్టి యెవడు ఈలోకముతో స్నేహము చేయ గోరునో వాడు దేవునికి శత్రువగును" (యాకోబు 4:4). అనవసర ప్రదేశము లన్నిట యందును సమాధానము కొరకు ప్రపంచము చూచున్నది. అయితే నిజమైన సమాధానము ( నందు మాత్రమే గలదు. యేసుప్రభువు ద్వారానే దేవునితో సమాధానము పొందగలము. కాబట్టి విశ్వాస మూలమున మనము నీతిమంతుల ముగా తీర్చబడి, మనప్రభువైన యేసు క్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియుందము (రోమా 5:1).

**క్రీస్తునందు సిద్ధపాటు యొక్క ఆశీర్వాదము :** ఎవరు సిద్ధపడి యుందురో అట్టి వారికి మాత్రమే నిత్యము నిలుచునట్టి ఆనందము కలుగును. "నేనిప్పుడే పానార్పణముగ పోయబడుచున్నాను. నేను వెడలిపోవు కాలము సమీపమైయున్నది. మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడ ముట్టించితిని, విశ్వాసము కాపాడు కొంటిని. ఇక మీదట నాకొరకు నీతి కిరీటముంచబడి యున్నది. ఆ దిన మందు నీతిగల న్యాయాధిపతియైన ప్రభువు అదినాకును, నాకు మాత్రమే కాకుండ తన ప్రత్యక్షతను ఆపేక్షించు వారి కందరికిని అనుగ్రహించును" (2 తిమోతి 4:6-8). క్రీస్తు యేసునందుండిన ప్రతి వ్యక్తికి మరణము కొరకై సిద్ధపాటు ఒక దీవెనకరముగ యుండును.

క్రీస్తుయేసునందుండని వ్యక్తికి మరణము కొరకైన సిద్ధపాటు గాని, లేక నిత్యజీవమును గూర్చిన వాగ్దానము గాని లేక తన శ్రమలను తానే భరించు కొనవలెను. క్రీస్తునందుండునట్లు సువార్త వినవలెను. "వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తున

గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). "మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచియున్నారు. మీ విశ్వాసము వ్యర్థమైతేనేగాని, నేను యే ఉపదేశరూపముగా సువార్త మీకు ప్రకటించితినో ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొనిన యెడల, ఆ సువార్త వలననే మీరు రక్షణ పొందువారై యుందురు" (1కొరింధి 15:1,2). రక్షణ పొందునట్లు మారుమనస్సు పొందవలెను; అనగా పాపక్షమాపణ నిమిత్తము యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెను. మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును (మత్తయి 10:32, రోమా 10:9,10). క్రీస్తుయేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? (రోమా 6:3, గలతి 3:27). క్రీస్తునందు విశ్వాసము గల ప్రతి వ్యక్తి మరణము కొరకైన సిద్ధపాటును నిత్యజీవము కొరకైన వాగ్ధానమును, శ్రమలయందు ఆదరణ, సహాయము, నిరీక్షణ కలిగి యుండును.

ఆత్మీయంగా నీవు యెచ్చట ఉన్నావు? క్రీస్తునందుంటివా? క్రీస్తు యేసునందున్న వారు సంఘమనే ఆయన శరీరములో యున్నారని క్రొత్త నిబంధన బోధించుచున్నది. సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు, క్రీస్తు అనుగ్రహించు సమాధానము మీ హృదయలలో వెలుగుచుండనియ్యుడి. ఇందుకొరకే మీరొక్క శరీరముగా పిలువబడితిరి (కొలస్సీ 1:18, 3:15).

- చార్ల్స్ బాక్స్

# ప్రభువు చేయు శిక్ష

## ( The Chastisement of God )

పరమందొక దేవుడున్నారు! అట్లయితే నీతిమంతులు ఎందుకు శ్రమ నొందుచున్నారు? ఆ నీతిమంతులు ఎందుకు భాగ్యవంతులగుచున్నారు? అనేకులు ఈప్రశ్ననడుగుదురు. దేవుడు జీవిస్తూ మానవనడవడిని కంట్రోలు చేయుచున్నట్లయితే నీతిమంతులకు ఎల్లవేళలా మేలు జరగాలి. దుష్టులు శిక్షింపబడాలని వారు తలస్తారు.

### ఎవడును నశింపవలెనని దేవుని కిష్టములేదు :

దేవుడు ప్రేమించే దేవుడని మనం జ్ఞాపకముంచుకోవాలి. అందరికీ మేలు జరగాలనే ఆయన కాంక్షింస్తారు. ఆయన ఎవడును నశింపవలెనని ఇచ్ఛయింపక అందరు మారుమనస్సు పొందాలని కోరుచు దీర్ఘశాంతము గల దేవుడై యున్నారు (2పేతురు 3:9). అందువలన దేవుడు దుష్టుల యెడల సయితము తన ప్రేమను వెల్లడిపరచు చున్నారు. "ఆయన చెడ్డవారి మీదను మంచివారి మీదను తన సూర్యుని ఉదయింపజేసి నీతిమంతుల మీదను అ నీతిమంతుల మీదన్ను వర్షము కురిపించుచున్నాడు" (మత్తయి 5:45).

### మనుష్యుని శ్రద్ధ అంతటినీ దేవుడు దీవించును :

దుష్టులు ప్రకృతి సూత్రములకు లోబడి, నాటుటకు, పనిచేయుటకు, కోతకోయుటకు శ్రద్ధకలిగిన వారైతే వారు సమృద్ధియైన పంటను కోయుదురు. తమ వ్యాపారమునందు శ్రద్ధకలిగిన వారైతే, యదార్థత, కృషి యొక్క ఫలితము వలన వారు లాభప్రాప్తి పొందుదురు. "వెలుగు సంబంధులకంటె ఈలోక సంబంధులు తమ తరమును బట్టి చూడగా యుక్తి పరులై యున్నారని" యేసుప్రభువు చెప్పారు (లూకా 16:8). నీతిమంతులైన వారు లోకస్థులవలె కష్టపడి పనిచేయకుండా, శ్రద్ధలేకుండా యుంటే లోకస్థులే సంపన్నుల గుటలో ఆశ్చర్య

పడనక్కరలేదు. దేవుడు ఆకాశము నుండి వర్షమును ఫలవంతములైన రుతువులను దయచేయుచు ఆహారము ననుగ్రహించుచు అందరి హృదయము లను ఉల్లాసముతో నింపుచున్నారని అపొ.కా. 14:1 చెప్పుచున్నది.

**అందరి లెక్కలు ఆయన ఇక్కడే చూడరు :**

ఈలోకంలో భక్తిపరుల కంటే దుష్టులే సంపన్నులుగా యుంటే, మరొక లోకంవున్నదని మనం గుర్తుంచు కోవాలి. రాబోవు లోకంలో పరిపూర్ణత లేని ఈలోకపు అన్యాయములన్నీ దిద్దు బాటు చేయబడ్తాయి. అందువలన నీతిమంతులు ఈలోకంలో పరిపూర్ణతను కాంక్షించ కూడదు. గాని పరలోకంలో పరిపూర్ణత యుండును. అగ్నిజ్వాలలలో యాతన పడుచున్న ధనవంతునితో దేవుడు, "కుమరుడా, నీ జీవితకాల మంతయు నీకిష్టమైనట్టు సుఖము అనుభవించితివి. అలాగుననే లాజరు కష్టము అనుభవించె నని జ్ఞాపకము చేసికొనుము. ఇప్పుడైతే వాడు ఇక్కడ నెమ్మది పొందుచున్నాడు, నీవు యాతనపడుచున్నావు" అని చెప్పెను (లూకా 16:25).

**దుర్మార్గుడొకడు నీతిమంతుని తో ఇట్లన్నాడు :**

"దేవుడున్నాడనినీవంటావు. నేను దానినినమ్మను. నాభార్యపిల్లలు ఆరోగ్యంగా యున్నారు. నాపశువులు బలిసియున్నవి. మంచిపాడి నిచ్చుచున్నవి. నాకోత విస్తారముగా యున్నది. నీ భార్య పోయిన సంవత్సరము చని పోయింది, నీపిల్లలు నీరసముగా యున్నారు. నీపశువులకు రోగము సోకినది, నీకోతకొంచెముగానే యున్నది. గనుక దేవుడు లేడని ఇది రుజువు చేయుచున్నది. ఆయన వుంటే నీవు అభివృద్ధిజెందాలి, నేను క్షీణించాలి. అందుకా నీతిమంతుడు "లెక్కలన్నీ దేవుడు ఇక్కడేచేసేయుడు" అని జవాబిచ్చాడు.

**శిక్ష దేవుని ప్రేమకు సూచన :**

దేవుడు తన కావుదల ననుసరించి ప్రత్యేకమైన శిక్షలకు మనలను గురి చేయునని

నీతిమంతులు జ్ఞాపకముంచు కోవాలి. కొందరు దీనిని అర్ధము చేసి కోలేనందున దేవదూషణ చేస్తారు, పొరబడ్డారు. విరక్తులగుతారు. గాని బైబిలు ఇట్లు చెప్పుచున్నది. "నా కుమారుడా, ప్రభువు చేయు శిక్షను తృణీకరించకుము. ఆయన నిన్ను గద్దించినప్పుడు విసుగకుము. ప్రభువు తాను ప్రేమించు వానిని శిక్షించి తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును. శిక్షాఫలము పొందుటకై మీరు సహించుచున్నారు; దేవుడు కుమారులనుగా మిమ్మునుచూచుచున్నాడు. తండ్రి శిక్షించని కుమారుడెవడు? కుమాళ్లయిన వారందరు శిక్షలో పాలు పొందుచున్నారు. మీరు పొందని యెడల దుర్బీజులే గాని కుమారులు కారు" (హెబ్రీ 12:6-8). ఈ లేఖనము నుండి మనం అనేక సంగతులు నేర్చుకోగలము. మొట్ట మొదటిగా, మనం శిక్షింపబడకపోతే దేవుడు మనలను కుమారులుగా కాదు గాని దుర్బీజులుగా ఎంచుచున్నారు. గనుక క్రైస్తవుడు శిక్ష అనుభవింపకపోతే ఆందోళన చెందాలి. శిక్ష దేవుని ఆగ్రహముకు కాదుగాని అనుగ్రహమునకే గురుతు.

### అన్ని విపత్తు శిక్షకాదు :

మనకు కలిగే శోధనలు అర్ధరహితమైన విపత్తులని చూడవద్దు, లేదా అవి ప్రకృతి వలన కలిగినవని భావించ వద్దు. తుఫానులు, వరదలు, భూకంపములు, రోగములు మొదలైనవి విపత్తులుగా రావచ్చును. వీటి నుండి క్రైస్తవుడు మినహాయించబడునని దేవుడు వాగ్దానము చేయలేదు. గనుక కలిగే ప్రతివిపత్తు దేవుని నుండి కలిగే శిక్షయని, ఏదో ఒక రీతిగా దేవుడతనిని శిక్షించుచున్నాడని తలంచవద్దు. క్రైస్తవులు, క్రైస్తవేత్తరులు కూడ ప్రకృతి విపత్తులుకు లోనగుదురు. అయితే క్రైస్తవునికి కలిగే విపత్తులన్నీ ప్రకృతి వలన కలిగేవి కావు. హెబ్రీ 12:6-8 ప్రకారము దేవుడు తన కాపుదలననుసరించి క్రైస్తవునికి ప్రత్యేక శిక్షననుగ్రహించును. పాపము చేయుటకై కలుగు శోధనలన్నీ అపవాది

నుండియే కలుగునని కూడ బైబిలు బోధించుచున్నది. కొన్ని విపత్తులు అపవాది వలన కలుగును. దేవుడు మనలను శిక్షించునపుడు లేదా అట్లు చేయుటకు అపవాదికి అనుమతి నిచ్చినప్పుడు దానిని తృణీకరించ వద్దని హెచ్చరింపబడి యున్నాము. విపత్తులు సంభవించినప్పుడు మనం తిరుగుబాటుతనము, నిరుత్సాహము, సంశయములకు తావీయకూడదు. అవి అన్యాయము, అక్రమము అని తలంచకూడదు. మనము విసుగ కూడదని కూడ హెచ్చరింపబడి యున్నాము.

### శ్రమలలో క్రైస్తవులు మహిమ పరచుదురు :

గడ్డుకాలమును దేవుడు నాకు పంపియున్నారు గనుక ఆయనను గుర్తించి నేనాయనకు లోబడి యేయుందునని తలంచితే అది అంగీకారయోగ్యమైనది. "ఆయన కుమారుడై యుండియు తాను పొందిన శ్రమల వలన విధేయత నేర్చుకొనెను" (హెబ్రీ 5:8). శిక్ష దేవుని ప్రేమకు సూచనయై యున్నది. "ప్రభువు తాను ప్రేమించు వానిని శిక్షించును" (హెబ్రీ 12:6). అందువలన మనం శ్రమల యందు ఓర్పుగలవారైయుండాలి (రోమా 12:12). అవును, మనం ఇంకా ఎక్కువ చేయగలగాలి. మనం శ్రమల యందు అతిశయపడాలి (రోమా 5:3). క్రీస్తు యొక్క శ్రమలలో పాలివాడగుటకు పౌలు కాంక్షించాడు (ఫిలిప్పీ 3:10). "మీరు నానావిధము లైన శోధనలలో పడునప్పుడు అది మహానందమని ఎంచుకొనుడి" యని యాకోబు వ్రాసాడు (యాకోబు 1:2). మనము ఆయన నామము నిమిత్తము నిందించబడి హింసింపబడునప్పుడు సంతోషించి ఆనందించాలని యేసు ప్రభువు చెప్పారు.

శిక్షించడానికి ప్రత్యేక కారణము లుండ వచ్చును, లేని యెడల దేవుడు దానిని కలుగనీయరు. మనమేలు కొరకే ఆయన శిక్షించుచున్నాడని హెబ్రీ 12:6 చెప్పుచున్నది. శిక్షలో మనకు

కలిగే ఈ మేలు యేమిటి ?

**శిక్షలో పెరుగుదల సాధ్య మగును :**

"ప్రస్తుత మందు సమస్త శిక్షయు దు:ఖకరముగా కనబడునే గాని సంతోషకరముగా కనబడదు. అయినను దాని యందు అభ్యాసము కలిగిన వారికి అది నీతియను సమాధానకరమైన ఫలమిచ్చునని" హెబ్రీ 12:11 చెప్పుచున్నది. మన మాయన పరిశుద్ధతలో పాలు పొందుటకు గాను ఈలాగు జరుగునని హెబ్రీ 12:10 చెప్పుచున్నది.

అది ఈలాగుపనిచేయును. ఒకడు క్రైస్తవుడైనప్పుడు అతడు పాపము నుండి విడుదలచేయబడును, పవిత్రడగును గాని అనుభవము లేని వాడగును. అతడు నీతియందు శిక్షణ పొందియుండలేదు, "అతడు నీతివాక్య విషయములో అనుభవములేని వాడై యున్నాడు'' (హెబ్రీ 5:13). అభ్యాసము చేత మేలు కీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములను కలిగి యుండు నట్లు అతడు ఎదగాలి (హెబ్రీ 5:14). ఈ ఎదుగుదల శిక్షలో సాధ్యమగును. దేవుడు మన నుండి పవిత్రత అన్నపుడు అపవిత్రత కూడ యున్నది. నమ్మకము అన్నపుడు అపనమ్మకము కూడ గ్రాహ్యమగును. అందువలన మనం శోధనలోపడునప్పుడు దానిని మహానందమని ఎంచుకోవాలి, మనకు కలుగు ఈ విశ్వాస పరీక్షలు పుటము వేయబడే బంగారముకంటే ప్రశస్త మైనవి (1పేతురు 1:7). రక్షింపబడిన వారు "మహాశ్రమల నుండి వచ్చిన వారు గొర్రెపిల్ల రక్తములో తమ వస్త్రములు ఉదుకుకొని వాటిని తెలుపు చేసికొన్నవారు" (ప్రకటన 7:14). పరలోక మందుండు దేవుని ప్రజలు యుద్ధములు చేసి విజేయులైన వారు "శోధన సహించు వాడు ధన్యుడు. అతడు శోధనకు నిలిచినవాడై ప్రభువు తన్ను ప్రేమించు వారికి వాగ్దానము చేసిన జీవకిరీటము పొందును" అని యాకోబు 1:12 చెప్పుచున్నది. అందు వలన "మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి..

మీరు సంపూర్ణులును అనూనాంగులును ఏ విషయములోను కొదువలేని వారునై యుండునట్లు ఓర్పు తన క్రియను కొన సాగింపనీయుడి" (యాకోబు 1:2-4). "ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసివేయును" అని యోహాను 15:2లో యేసు చెప్పారు.

### క్రైస్తవులు శ్రమలలో ఓర్పుకలిగి యుందురు.

గనుక శ్రమలు సంభవించు నపుడు మనము సొమ్మసిల్లిపోము, అన్యాయమని సణుగుకొనము, లేదా పాపము యొక్క సూచనయని గాని తలంచము. శ్రమలు దేవుని ప్రేమకు సూచనలు. వాటి ద్వారా మనకు మేలు కలుగును. మనం పరీక్షింపబడి పవిత్రులుగా చేయబడుదుము. అందువలన శ్రమలలో మనం ఓర్పు కలిగి యుండాలి, అవి ప్రశస్తమైనవి. వాటి ద్వారా మనం దీవించబడ్డాము. క్రీస్తుయేసు యొక్క శ్రమలలో పాలి వారమవుచున్నందుకు దేవునికి కృతజ్ఞత చెల్లించాలి. నీతి, సమాధానమను ఫలములు ఫలించాలి. వాడబారని జీవ కిరీటము కొరకు ఎదురు చూడాలి.

- ఓటిస్ గేడ్వుడ్

## హన్నా నుండి మరొక పాఠము - 2

## ( Another Lesson from Hannah )

సమూయేలు తల్లియైన హన్నా యొక్క భక్తి ప్రభావములను గూర్చి గత సంచికలో మనము కొంత నేర్చుకొం టిమి. ఆమెకు పిల్లలు లేకపోగా యెహోవా దేవునికి ప్రార్థన చేసి ఆయన నుండి ఒక కుమారుని సంపాదించు కొనెను. అతనిని ఆమె బాల్యవయస్సు లోనే యెహోవా సేవ కొరకు దేవుని మందిరములో విడిచిపెట్టెను. హన్నాను బట్టి తన కుమారుడైన సమూయేలు గొప్ప ప్రవక్త యయ్యెను. ఇంచుమించు అయిదు వేల సంవత్సరముల క్రితము జీవించిన హన్నా ఈ నాడు కూడ మనకు గొప్ప

పాఠములను నేర్పుచున్నది. వాటిలో కొన్నిటిని ఇప్పుడు గమనించుదము.

**1. సణుగుచు గొణుగుచు ఈ జీవితమును జీవించుట కన్న యెహోవా దేవుని యందు భయభక్తులు కలిగి ప్రార్థన జీవితమును జీవించుట మేలని హన్నా మనకు** బోధించుచున్నది. హన్నాకు పిల్లలు కలుగ లేనందున తన వైరి యైన పెనిన్నా ఆమెను విసిగించుచు, కోపము రేపించుచు వచ్చెను. హన్నా అయితే ఆమె పై సణుగుకొనక యెహోవా దేవునికి తనకు కలిగిన శ్రమను గూర్చి విజ్ఞాపన చేసెను, త్వరలోనే ఆ శ్రమ నుండి విడిపింప బడి ఘనురాలనబడెను. అందుకే "మీలో ఎవనికైనను శ్రమ సంభవించెనా? అతడు ప్రార్థన చేయ వలెను" అని భక్తుడైన యాకోబు మనలను హెచ్చరించు చున్నాడు (యాకోబు 5:13). నీతిమంతుని ప్రార్థన మనఃపూర్వకమైనదై బహు బలముగలదై యుండునని కూడ అతడు చెప్పుచున్నాడు (5:16).

**2. దుర్మార్గతతో నిండిన ఈ లోకములో భక్తిగల స్త్రీలు సాధించగలిగిన మేలు ఎంతైనా** యున్నదని హన్నా జీవితమునుబట్టి మనము గ్రహించుకొనగలము. పాపముతో నిండియున్న ఈలోకములో ఒక భక్తిగల స్త్రీ జీవితము ఎంతో శక్తి వంతమైనది. ఏలయనగా 'ప్రభువు కన్నులు నీతిమంతుల మీదను ఆయన చెవులు వారి ప్రార్థనల వైపునను ఉన్నవి గాని ప్రభువు ముఖము కీడు చేయువారికి విరోధముగా ఉన్నది అని దైవవేదము బోధించు చున్నది (1 పేతురు 3:12). దేవుడు చేసిన సృష్టి అంతటిలోను అత్యంత ప్రశస్తమైన ముత్యము స్త్రీ. ఆమె ఒక భార్య వలెను, తల్లి వలెను పరిచర్య చేయుట కనుకూలముగ దేవుడామెను దీవించెను. తన పాత్రను తాను సరిగ పోషించిన యెడల ఆమె తన ప్రభావమును మరింత ఎక్కువ వెదజల్లును. సరిగదా తనకు తానే మేలు కలుగజేసికొనును. హన్నా యొక్క జీవితము తల్లులందరికి ఘనత

తెచ్చిన జీవితము. ఆమె జీవితము తన జనాంగమునకు, మానవజాతి కంతటి కిని కూడ ఘనత తెచ్చిన జీవితమై యున్నది.

తల్లి వలె దేవుడామెకిచ్చిన గొప్ప పనిని గూర్చి హన్నా విసుగు కొనినట్లు గాని, సణుగుకొనినట్లు గాని మనకు కనబడుట లేదు. సరిగదా దేవుని సహాయముచేత ఆమె తన పని లో మహిమ పొందెను. దుష్ట శక్తులు ఆమెచే ఓడింపబడెను. ఈలోకము దీవించబడెను. ఆమె జీవితము యొక్క ప్రభావము అంత గొప్పది.

పిల్లల యొక్క ప్రవర్తనను, నడవడిని తలిదండ్రులు గరపుదురు. ఇంకొకమాటలో తల్లిదండ్రుల యొక్క ప్రవర్తనను బట్టి బిడ్డల ప్రవర్తన యుండునని మనము గ్రహించుకొన వలెను. సమూయేలు జీవితములో తల్లి యొక్క ప్రభావము ఎక్కువ అని మనము ఎరుగుదుము. అందుకే "తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షణలోను బోధలోను వారిని పెంచుడి" యని అపొ.పౌలు హెచ్చరించుచున్నాడు (ఎఫెసీ 6:4). మనుష్యులు ముండ్ల పొదలలో ద్రాక్షపండ్లనైనను, పల్లేరు చెట్లను అంజూరపు పండ్లనైనను కోయరు అని యేసు బోధించెను (మత్తయి 7:16). భక్తిగల కుటుంబము యొక్క శక్తి ఇప్పటికిని మరెప్పటికిని ఎంతో గొప్పది. ఈ లోకసంబంధమైన కుళ్ళు పిల్లలలో ప్రవేశించకుండవలె నంటె తల్లిదండ్రులు దైవ భయము కలిగిన వారై యుండవలెను. అందు వలన తల్లిదండ్రులు క్రైస్తవులై యుండుట బిడ్డలకు ఎంతయో ఆశీర్వాదకరము

**3. తన పిల్లలను దేవుని యొక్క జ్ఞానములోను, భయములోను, భక్తి లోను పెంచు బాధ్యతను దేవుడు ఇంకను తల్లికే ఎక్కువ యిచ్చెనని హన్నా జీవితమును బట్టి మనము నేర్చుకొనగలుగుచున్నాము.** సమూయేలు ఇంక బాల్యదశలో యుండగనే హన్నా అతనిని దేవుని సేవకొరకు దేవుని మందిరములో అర్పించెను. యేసు

క్రీస్తు కూడ ఆయన ఇంకా పంద్రెం డేండ్ల వయస్సులో యుండగానే దేవుని గూర్చిన జ్ఞానమునందాశక్తిని కనబరచెనంటే బాల్యదశలోనే ఆయన తన భౌతిక తల్లిదండ్రుల నుండి పొందిన శిక్షణయే యని మనము చెప్పుకొనవచ్చును. ఆయన జ్ఞాన మందును, మనుష్యుల దయయందును, దేవుని దయయందును వికసించి పెరిగెను. ఆయన అన్ని విధములుగ తన యభివృద్ధిని కనుబరచెను. అయితే నేటి బాలబాలికలను మనము గమనించిన లోకసంబంధమైన ఆశలలో వారి యభివృద్ధి చాల కనబడుచున్నది. ఆత్మీయ వికాసము వారిలో సున్న, మానసిక వికాసమయితే బహు స్వల్పము. అయితే ఇది ఎందువలన అట్లు కలిగెను? దానికి కారకులు చాలమట్టుకు తల్లిదండ్రులే యని మనము చెప్పుకొనక తప్పదు. పిల్లలు అడిగిన ప్రతి దానిని వారికి కొనితెచ్చి, ఒక్కోసారి వారికి అక్కరలేని లోక సంబంధ వస్తువులను కొనితెచ్చి యిచ్చి వారి ఆత్మీయ వికాసమును అపుచేయుచున్న తల్లిదండ్రులనేకులు మనమధ్య కలరు. పిల్లల యెదుట సత్ప్రవర్తన లేక, లోకాశలలో వారికున్న బలహీతనలకు వారే లొంగిపోయి తమ పిల్లల ఆత్మీయ క్షేమమును పాడుచేయుచున్న తల్లిదండ్రులనేకులు కలరు. అట్టి వారు తమ జీవితమును, మనస్సును, ప్రవర్తనను మార్చుకొనని యెడల వారు తమ బిడ్డలనే కాదు, తమ ఆత్మలనే కోల్పోవుదురు.

చిన్నప్పుడే సమూయేలును ప్రభువు నొద్దకు హన్నా నడిపించి ఘన కార్యము చేసెను. నేటి మన తల్లులు తమ పిల్లల క్షేమము కోరినవారైతే వారిని లోకమునకు కాక తమ దేవుని చేతికి అప్పగింతురు. బాల్యదశలోనే పిల్లలు లోకమునకు విడిచి పెట్టబడినందున శాశ్వతముగా వారు నాశనమగుదురు. చిన్నతనము నుండియే వారికి దేవుని వాక్యమును బోధించు బాధ్యత ప్రతి క్రైస్తవ తల్లిదండ్రులు కలిగియుండాలి. అపో.పౌలు చెప్పుచున్న ఈ మాటలను వారు నేర్చుకొనుటయే గాక, తమ పిల్లలకు

నేర్పించవలసి యున్నది. “మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలో నున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తు కారు విలువ పెట్టి కొనబడిన వారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి” (1 కొరింధి 6:19, 20). మరల “మీరు దేవుని ఆలయమై యున్నారనియు దేవుని ఆత్మ మీలో నివసించుచున్నాడనియు మీరెరుగరా? ఎవడైనను దేవుని ఆలయమును పాడు చేసిన యెడల దేవుడు వానిని పాడు చేయును. దేవుని ఆలయము పరిశు ద్ధ మైయున్నది; మీరు మీ ఆలయమై యున్నారు” (1కొరింధి 3:16,17). తమ శరీరాత్మల పరిశుభ్రతను గూర్చి బిడ్డలకు నేర్పు బాధ్యతను తల్లిదండ్రులు కలిగియున్నారు. బాల్యదినముల నుండి దేవుని పరిశుద్ధ లేఖనముల నెరుగని పిల్లల జీవితములకు, వాటి నెరిగిన పిల్లల జీవితములకు గొప్ప వ్యత్యాస మున్నది. ప్రతివాడు తన జీవితములో దేవుని ప్రధమముగా ప్రతిష్ఠించుకొనుట అత్యవసరము. హన్నా తన జీవితము లో దేవునికి ప్రధాన స్థానమిచ్చెను. అందువలన ఆమె జీవితము ఇప్పటి కింకను అనేకులకు వెలుగిచ్చుచునే యున్నది.

ఈ కార్యక్రమమును వినుచున్న నీవు తల్లివైన యెడల నీబిడ్డల ఆత్మీయ క్షేమము కొరకు ఎంతమట్టుకు పాటు పడుచున్నావో ఆలోచించుకొనుము. హన్నా వంటి హృదయము నీకున్నదా? నీ బిడ్డలను సమూయేలు వలె దేవుని రాజ్యములో మంచి పనివారిగా తయారు చేయగలవా? నీ బిడ్డలు దేవుని రాజ్యములో పనిచేయవలెనంటె ముందు నీవు, నీ కుటుంబము అందుండవలెను. నీవింకను క్రైస్తవు రాలవు లేక క్రైస్తవుడవు కాని యెడల, యేసుక్రీస్తు నందు విశ్వాసముంచుము, నీ పాపము విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుము. క్రీస్తు సంఘములో యుండి నీకుటుంబ సమేతముగా క్రీస్తుకు సేవ చేయుము. క్రీస్తులోను ఆయన సంఘములోను ఈనాడే నీవు ఎందుకు ప్రవేశించకూడదు?

# మన రాజు వచ్చుచున్నాడు

## ( Our Kings is Coming )

యేసుక్రైస్తవుని రాజు, ఆయన రాజులకు రాజుగా ప్రభువులకు ప్రభువుగా పాలించుచున్నారు. రాజ్యమేలు చున్నారు (ప్రక 17:4; 19:16). ఆయన అన్ని విషయముల లోను సంఘమునకు శిరస్సై యున్నారు. ఆయనే దాని రక్షకుడు ఆయన దేవుని కుడి పార్శ్వమున ఆసీనుడై నేడును సజీవుడై యున్నారు. మరల వచ్చు సమయము కొరకు ఆయన కనిపెట్టు చున్నారు.

మహిమగల రాజైన యేసు తన దూతలతో కూడ మరలవచ్చును. అది ఎంత ఘనమైన శక్తివంతమైన దృశ్యమో. ఈలోక జనాంగము లన్నియు ఆయన మహిమను చూచును; ఆయనను పొడిచిన వారును చూచెదరు; భూజనులందరు ఆయనను చూచి రొమ్ము కొట్టు కొందురు; ఆమేన్" (ప్రక 1:7).

యేసు ఈ లోకమునకు వచ్చి యెరూషలేములో తన సింహాసనము నేర్పరచి వెయ్యేండ్లు పాలించునని అనేకులు బోధిస్తారు. గాని విచారం యేమంటే ఆ బోధ బైబిలులో కానరాదు. యేసు యొక్క రాజ్యము ఆయన శిష్యుల జీవిత కాలములోనే స్థాపించబడింది (మార్కు 9:11). ఆ రాజ్యము అప్పటికే యున్నట్లును కొందరు దానిలోనికి మార్చబడినట్లును కొలస్సయులకు వ్రాసిన పత్రికలో పౌలు చెప్పాడు (కొల 1:13,14). రాజ్యము స్థాపించబడే యున్నది. క్రీస్తు దాని పై రాజుగా రాజ్యమేలు చున్నారు.

క్రీస్తు యొక్క రెండవ రాకడను గూర్చి తేదీలు నిర్ణయించడం కొందరికి పరిపాటి. గాని క్రీస్తు మరల ఎప్పుడు వచ్చునో ఎవరికీ తెలియదని లేఖనములు చెప్పుచున్నవి. "ప్రభువు దినము దొంగవచ్చినట్లు వచ్చును" (2 పేతురు 3:10). లోకులు నెమ్మదిగా

యున్నది. భయమేమియు లేదను చుండగాను, కొందరు ఆయన రాకడను గూర్చిన వాగ్దానమేమాయెను? పితరులు నిద్రించినది మొదలుకొని సమస్తమును సృష్టి ఆరంభమున నున్నట్లే నిలిచియున్నదే అని చెప్పుకొను చుండగా, ప్రభువు ఆర్భాటముతోను ప్రధాన దూత శబ్దముతోను దేవుని బూరతోను పరలోకము నుండి దిగి వచ్చును (1థెస్స 5:32; 2పేతురు 3:3,4; 1థెస్స 4:16). గాని ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు మనకేమియు తెలియదు. గాని ఆయన తప్పక వచ్చును. నేను మరల వత్తునని ఆయనే చెప్పెను (యోహాను 14:3).

యేసు ఈ లోకములో శ్రమలను, హేళనను, దూషణను, అవిశ్వాసమును, సిలువను భరించి, కొరడా దెబ్బలను సహించి ఈ లోకమును విడిచెను. గాని ఆయన మహిమతో, శక్తితో, ఘనతతో తీర్పు తీర్చుటకు వచ్చును.

మన రాజు మరల వచ్చినప్పుడు ఆయన మృతులనందరినీ అల్పులనేమి ఘనులనేమి అందరినీ లేపును (ప్రక 20:12). ఘనతను, ఐశ్వర్యమును, ఈ లోక బలమును పొందిన మానవు లందరు ఆయన యెదుట నిలుతురు. ధనికులు, దరిద్రులు, బానిసలు, స్వతంత్రులు అందరు క్రీస్తుకు లెక్క అప్పగింతురు (2 కొరింధీ 5:10). అక్కడ పక్షపాతమేమివుండదు; ఆ రాజు వచ్చినప్పుడు ఎవడు తప్పించుకొన జాలడు.

మనుష్యులు దాగుకొన జూతురు. వాళ్ళంతా ఒకే రీతిగ సాకులు చెప్పజూడవచ్చును. వారు పాపములో మునిగిపోయి ప్రభువుచే కనుగొనబడి బాధలో ఏడ్వవచ్చును. ఇవేమి ఆ రాజు యెదుట ఆ రోజు పని చేయవు. ఆయన తీర్పు కనికరము లేనిదై యుండును. ఆ మనుష్యులు భూమి మీద యుండగా ప్రభువు వారికి అవసరమైనంత కనికరం చూపారు.

యేసు మరల వచ్చినపుడు ఆయన రాజ్యము తండ్రికి అప్పగించును (1కొరి 15:22-28). రాజులకు రాజు అపవాదిని అతని అనుచరులను జయించి యుండును. దేవుని రాజ్య పౌరులు తండ్రిచే నిత్యము ఆశీర్వదించ బడుదురు.

రాజులకు రాజు తిరిగి వచ్చు చున్నారు. గనుక ప్రతివాడు ఆ ఘడియ కొరకు సిద్ధపడవలెను. క్రీస్తునందున్న వారు నమ్మకముగా జీవించవలెను (తీతు 2:11,12). క్రీస్తులో లేని వారు ఆయనకు లోబడి సిద్ధపడి యుండ వలెను. (మత్తయి 7:21; మార్కు 16:15,16; హెబ్రీ 5:8,9).

మన రాజు వచ్చుచున్నారు. నీవాయన రాజ్యములో లేకపోతే ఇప్పుడే ఆయనకు లోబడుము. ఆయన రాజ్యములో నీవుండాలని ఆయన కోరు చున్నారు.

- చార్ల్స్ కాబ్


**YOU TUBE లో**

**సత్యవాణి కార్యక్రమములను 24 గంటలు చూడండి**

**Satyavanicoc.kkd అని క్లిక్ చేయండి**

# సంక్షిప్త వార్తలు

2018 డిశంబరు 2వ తేదీ ఆదివారము నుండి 6వతేదీ గురువారం సాయంత్రము వరకు సత్యవాణి క్రీస్తుసంఘ ఆవరణలో **Polishing the Pulpit (PTP)** బైబిలు లెక్చరర్షిప్ ఘనముగా జరిగెను. ఆ ఆరు దినములలోను హాజరైనవారు ఇంచుమించు 5 వేలమంది యుండిరి. పలు రాష్ట్రముల నుండి, పట్టణముల నుండి సోదర సోదరీలు హాజరై గొప్ప సహవాసమును, ఆశ్చర్యకరమైన బైబిలు పాఠములను వినుచు గొప్ప ఆత్మీయానుభూతిని పొందిరి.

పంజాబు, ఒరిస్సా, మహారాష్ట్ర, తమిళనాడు, కర్నాటక, తెలంగాణ, ఆంధ్రరాష్ట్రముల నుండి సోదరసోదరీలు ఈ బైబిలు లెక్చరర్షిప్‌కు హాజరైరి. పంజాబు నుండి వచ్చిన సోదరులు ఎర్నెస్ట్‌గిల్ గారు రెండు మూడు సార్లు ఈ కూటములలో వాక్యపరిచర్య చేసిరి. అలాగే ఔరంగాబాద్, మహారాష్ట్ర నుండి వచ్చిన యేషుదాస్ తిమోతి దొంగర్‌దివే గారు కూడా హిందీలో వాక్యపరిచర్య చేయగా రిక్కీగూటంగారు దానిని తెలుగున కనువదించిరి.

అమెరికా నుండి జాష్‌హాలోవే గారు రెండు రోజులకు ముందుగనే కాకినాడ చేరుకొనిరి. **PTP**లో ఆయన యాకోబు పత్రికను గూర్చి ఉపన్యసించిరి. మరియు కెల్లీవేడ్ గారు ఉపమానముల నాధారముగా మంచి బైబిలు పాఠములు బోధించిరి. స్టేన్‌బట్ గారు హెబ్రీ పత్రిక నుండి అనేక ఆసక్తికరమైన సంగతులను వెలికి తీస్తు గంభీరముగా బోధించిరి. మరియు తిమోతి విల్కోస్ గారు ప్రతిరోజు ఆశ్చర్యకరమైన బైబిలు అంశములను బోధిస్తూ ప్రజలనుత్తేజ పరచిరి.

ఆ తేదీలలో స్త్రీల కొరకు ప్రత్యేక తరగతులు నిర్వహించబడెను. వాటిలో సోదరీలు షీలాబట్, జార్జియాబట్, రూత్‌వేడ్ గార్లు హాజరైన వందలాది స్త్రీలకు ప్రత్యేకముగా బోధించిరి. సోదరీలు కబితా గూటం, సుదీప గూటం, రేచెల్‌గూటం, ఎలిపే సూవార్తమ్మ గార్లు తెలుగునకనువదించుటలో సహాయ పడిరి. లెక్చరర్షిప్ నాల్గవ దినము నాటికి రోనీగూటం దంపతులు అమెరికా నుండి తమ కుమార్తె ఫియోనాతో కాకినాడ చేరుకొనగా, హరితగూటం గారు

కూడ స్త్రీల కూటములలో పాల్గొనగల్గిరి. లెక్చర్‌షిప్ మూడవదినమందు ఆయా ప్రాంతములలో ఘనమైన సేవ చేయుచున్న యువక బోధకులను రిక్కీ గారు ఒక్కొక్కరినీ శాలువాలు కప్పి ఒక జ్ఞాపిక అందజేసి సత్కరించిరి.

సోదరులు జ్ఞానసుధీర్, ఆర్. ఉత్తమ్‌కుమార్, ఆర్.సి.హెచ్.సద్గుణరావ్, వి.రాజు, అనీల్‌కుమార్, యు.అశోక్ గార్లును మరికొందరును తర్జుమా చేయుటలో సహాయపడిరి. రిక్కీగూటం గారి నిర్విరామకృషివలన సమస్తము ఘనముగా నిర్వహించబడెను. స్థానిక సంఘము ఆహారవసతి వద్దనలలో ఎంతో సహకరించిరి. ఇంతగొప్ప కార్యమును ఘనముగా నిర్వహించిన దేవునికి, స్థానిక క్రీస్తుసంఘమునకు మా ధన్యవాదములు.

ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రములలో 260 సంఘముల నుండి సోదర సోదరీలు ఈ కూటములకు హాజరైనట్టు అంచనా. ఈ లెక్చర్‌షిప్ కొరకైన ఖర్చు అంతయు స్థానిక సంఘమే భరించి గొప్ప దీవెన పొందిరి.

**RNI Regd. No. 69973/98**
**Postal Regd.No. AP/KD-02/2018-20**

**From :**
**SATYAVAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.